# మైనపు ముద్దలు

-వేమిరెడ్డి పద్మావతమ్మ

'మళ్ళీ మరో ఊరు బదిలీనా?' అనుకుంటే ముందు భయం వేసినా, ఈ ఊరు, పరిసరాలు, ఎంచక్కా కొద్ది బాడుగలో కుదిరిన చక్కని ఇల్లు, అందులో వున్న అన్ని సౌకర్యాలూ, ఇంటి ముందున్న చక్కని చిన్న తోటా, మనసును రంజింప జేశాయి. వచ్చింది మొదలు ఎక్కడి వక్కడ సద్దుకోడానికే సరిపోయి, కాస్త తీరిగ్గా పడుకొందుకే వీలు దొరకలేదు. వళ్ళంతా నలగ్గొట్టినట్టు, ఇదీ అని చెప్పలేని బాధగా వుంది.

రెండు రోజులకు గానీ పని తెమిలినట్టనిపించలేదు. భోంచేసి తీరిగ్గా పడుకుని పత్రిక చేతిలోకి తీసుకున్నాను. ప్రక్కన పడుకొని శ్రీవారు సవరిస్తున్న సవరింపులు కాస్త విసుగ్గా, చికాగ్గా... మరికాస్త గిలిగింతగా అనిపిస్తున్నా పట్టించుకోకుండా పత్రికలో లీనమయ్యాను...

సన్నగా శబ్దం చేస్తూ తిరుగుతున్నది ఫ్యాన్. ఆ శబ్దాన్ని మించి ఒక్కసారిగా కిచకిచమనే శబ్దం మనోహరంగా వినిపించింది. పత్రిక పక్కకు జరిపి, తల ఎత్తి చుట్టూ చూశాను. కనుపించిన దృశ్యం మన సును రంజింపజేస్తే, పుస్తకం పక్కనబెట్టి, మోచేతి మీద బరువు మోసి, తల ఎత్తి పరిశీలిస్తున్నాను.

కరెంటు వైరింగ్ చేయడానికి పైన గోడ దగ్గర... నుండి, దూలానికి వంపు తిరగడానికిగాను వైర్లకు అడుగున ఒక కొయ్య దిమ్మ వేస్తారు. అది గోడకు ఆనినవైపు ముక్కోణాకారంలోను, ఇవతలి వైపు గుం డ్రంగానూ ఒంపు తిరిగి వుంటుంది. దానిపై ఆని కరెంటు వైర్లు వస్తాయి. ఇప్పుడంటె కన్‌సీల్డ్ వైరింగ్ కానీ... పాత రోజుల్లో కరెంటు వచ్చిన కొత్తల్లో వేసిన వైరింగంతా కనిపిస్తూనే వుండేది. అది ఒక చిన్న దిమ్మలాగా వుంటుంది. అంటే... దానిపై ఒక్క పిచ్చుక మాత్రమే కూర్చుందుకు వీలుగా...!

లలితలలితంగా, మృదువుగా వున్న ఓ ఆడ పిచ్చుక ఆ కొయ్య పలకపై ముడుచుకు కూర్చుని వుంది. ఓ మగపిచ్చుక హుందాగా, మెడ కింద వున్న నల్ల మచ్చతో, మగవాడినన్న దర్పంతో... గోడకు చీల బిగించి, తాడు కట్టి కాస్త ఓరగా వంచినట్టున్న శ్రీవారి ఫోటోపై వాలి వుంది. నిలబడి నిలబడి కాళ్ళు నొప్పిగా అన్పించా యేమో రివ్వున ఎగిరి, అటూ ఇటూ తచ్చాడి, మరో ఫోటోపై వాలింది. కాస్సేపు స్విచ్ బోర్డు మీద వాలింది. ఆశ్చర్యంగా దాని విన్యాసాలు చూస్తున్నాను.

అలా తిప్పలు పడేబదులు ఆ ఆడపిచ్చుకను నెట్టి వేసి, ఆ స్థానంలో ఎందుకు కూచోదు? అనిపించింది. దాదాపు లైటు వెలిగినంతసేపు, దాని స్థల మార్పుల విన్యాసాలు, దాని కిచకిచ ధ్వనులూ, చూస్తూ, వింటూనే వున్నాను. ఆడపిచ్చుకపై మగపిచ్చుకకున్న అభిమానానికీ, ప్రేమకూ కళ్ళు సజలాలయ్యాయి.

నిద్ర లేచి, కిటికీ తెరవగానే, రివ్వున జంటగా ఎగిరిపోయే పిచ్చుకల కేసి చూస్తూ వుండిపోయాను. అప్పటికప్పుడే మనసులో కలిగిన నిర్ణయం మనసుకు పన్నీటి జల్లులా అనిపించింది...

'ఏమిటిది? ఎందుకు?' అన్నట్టు ప్రశ్నార్థకంగా చూస్తున్న శ్రీవారి చేతికి, దీర్ఘ చతురస్రాకారంగా వున్న ఓ కార్డ్‌బోర్డ్ పలకను, సుత్తిని, నాలుగు మేకుల్ని అందించాను. "ఓహో! భూతదయా?!" అంటూ స్టూలు ఎక్కారు.

మూడు దంతుల్ని కలుపుతూ, క్రిందుగా ఆ పలకను ఆన్చి మేకులు కొట్టారు. మూడు దంతులు గోడల్లా అమిరి, బాగా విశాలంగా రెండు గూళ్ళూ తయార య్యాయి. అందులో పిచ్చుకలు రెండు జంటలు కలిసి రెండు కాపురాలుండొచ్చుననుకుంటె ఎంతో తృప్తిగా అనిపించింది.

ఆ రాత్రి, అటు తిరిగి, ఇటు తిరిగి, ఆ గూటి అంచున వాలిన మగపిచ్చుక తొంగి చూసి, వాటి భాషలో దాన్నీ పిలిచిందేమో! ఆడపిచ్చుకా రివ్వున ఎగిరి ఆ గూట్లో వాలింది. జంటగా గూట్లో ఒదిగిన వాటికేసి, సంతృప్తిగా చూసుకున్నాను. ఈసారి శ్రీవారి సవరింపులు విసుగ్గా, చీకాగ్గా అన్పించలేదు. మల్లెలూ, పారిజాతాలూ కలిపి, మంచి గంధంలో ముంచి చిలకరించినట్టై, కిలకిలలాడుతూ గుండెల్లో ఒదిగిపోయాను.

సాయంత్రం కాఫీ అందిస్తూ, శ్రీవారికి రాజా వ్రాసిన వుత్తరం అందించాను. వాళ్ళ వూళ్ళో బాగా జరిగే బతకమ్మ పండక్కి చూడ్డానికి రమ్మని, చాలా బాగా వుంటుందనీ, రాజు ఆహ్వానం. మావైపు అసలు బతుకమ్మ పండగంటేనే ఏమిటో తెలియదు. రాజు నా స్నేహితుడు. ప్రస్తుతం కుటుంబ స్నేహితుడు.

ఆడ-మగ మధ్య సెక్స్ తప్ప స్నేహానికి తావులేదనే శ్రీవారికి, కాదు ఆడ మగ మధ్య కేవలం సెక్సే కాదు అభిమానం, ఆదరణ, ఆప్యాయత, అనురాగం కలగలిసిన స్వచ్ఛమైన స్నేహం.. వుంటుందనేందుకు ప్రతీక రాజు. నా ప్రియమైన స్నేహితుడు నా ఆరాధకుడు.

ఎవరో ఏదో అనుకుంటారని నేను 'అన్నయ్యా' అని పిలిచేదీ లేదు. తను చెల్లీ అనేదీ లేదు. నేను 'రాజూ' అని పేరుతోనే పిలుస్తాను. తను 'ప్రియా' అని నా పేరుతోనే పిలుస్తాడు. నా పేరు పద్మప్రియ. ఎందుకో మిధ్యాగౌరవాలు మనుష్యుల మనస్సుల మధ్య అగాధాలేర్పరుస్తాయనుకుంటాను.

ఉత్తరం మడిచి యిస్తూ "ఏం? వెళ్తావా?" అన్నారు.

"ఏం వెళ్ళకూడదా?" అని ఎదురు ప్రశ్నించాను. భుజాలు కుదించి నవ్వేస్తూ "ఎందుకు వెళ్ళకూడదూ? కానీ ప్రియా! పిల్లలెలా? నాకేమో క్యాంప్స్ వున్నాయి వరసగా! ఎలా మరి?" ప్రశ్నార్థకంగా చూస్తూ అన్నారాయన. "పరవాలేదు. వాళ్ళ నాన్నమ్మ దగ్గరకు పంపుదాం!" అన్నాను.

ప్రయాణం రోజు దగ్గర పడేకొలదీ ఒకే హడావిడీ, ఆతృత, ఆరాటం. పిల్లల్ని రెండ్రోజుల ముందుగానే, నెల్లూరులో వున్న వాళ్ళ నాన్నమ్మ దగ్గరికి దింపి వచ్చేరాయన. వచ్చీరాగానే, హడావిడిగా క్యాంప్స్ వున్నాయంటూ, నెల్లూరే వెళ్ళిపోయారు. పరవాలేదు. సాయంత్రానికి తండ్రి పిల్లల దగ్గరకు చేరుకుంటారన్న నిశ్చింత.

బెర్తు రిజర్వేషను చేసి, బోగీ, సీటు నెంబరూ, వస్తున్న తారీకు, రైలు అన్నీ వివరంగా వుత్తరం వ్రాశాను. దాదాపు వంద మైళ్ళ దూరాన్నుండి, హైదరాబాదు వచ్చి, అక్కడ స్టేషనులో నన్ను రిసీవ్ చేసుకుని, వాళ్ళ వూరికి తీసుకెళ్ళాలి. అది చాలా రిస్క్ కదా! అందుకే, నీవు వస్తావా రావా? రాకపోతే పలకను. ఉత్తరాలు వ్రాయను అని వేధిస్తూ వుత్తరాలు వ్రాస్తున్న రాజుకు 'పిడుగులు పడ్డా వస్తాన'ని వుత్తరం వ్రాశాను. ఆ బతకమ్మ పండగ ఎలా చేస్తారో చూడాలన్న ఉత్సుకతను మించి, రాజును, వాళ్ళ కుటుంబ సభ్యులను కలిసి మాట్లాడాలన్న పట్టుదల.

ఉదయం నుండి మబ్బు మబ్బుగా వుంది. వర్షం వచ్చేలా. కాదు.. కాదు.. తుపాను వచ్చేలా వుంది వాతావరణం. ఎక్కడో వాయుగుండం ఏర్పడిందన్న వార్త. అయినా, రైల్లో పడిపోతే, ఆ తర్వాత ఎప్పటికైనా చేరనీ! అన్పించింది. మరీ చీకటి పడితే ఇబ్బందని,

## దీపెంతవయితివి

సీకటిగాకముందే
పొద్దుపోవట్టెకొడ్కా అన్కుంట
నల్లని మసిబుగ్గను
బుడ్డితోటి తెల్లగ తుడ్సెదానివి
నీ మమకారాన్నంతా చిమ్నీలో
నింపేదానివి
అయ్య అగ్గిపులతో ఎల్గించిన
దీపెంకు మొక్కి
నా నుదుట మీద ముద్దుపెట్టేదానివి
అయ్యను జూస్కుంట ముర్సేదానివి
కుండలో ఆర్పిన బువ్వలో
చింతపప్పు పులుసు బోసి
పిసుక్కుంట పిసుక్కుంట
ముద్ద ముద్దలు గట్టి
గిది అయ్యది గది నాది
ఇంగ గిది అక్కది అన్కుంట
బువ్వనంత నీ చేతితో తిన్పించేదానివి
అవ్వా దీపాన్ని జూసినప్పుడల్లా
నువ్వే యాదికస్తవే
గుడిలో కాలుతున్న
గండు దీపంలా కన్పిస్తవే
తాగొచ్చి అలసిన అయ్యముంగుట
దీపంబెట్టి తాటినింద
బువ్వను పెట్టి బుగులు పట్టేదానివి
బుక్క ఇడ్సవెట్టకుంట
అయ్య ఆయింత తింటే
నువ్వు పండ్గజేస్కున్నంత
లవు సంబరపడేదానివి
అవ్వా మా బతుకుల కోసం
కాకరవత్తుల్లా కాలితివి
భూచక్రంలా గిర్రు గిర్రున
తిర్గుంట పన్లు జేస్తితివి.
మతులబులా మతాబుల్లా మాడితివి
దివిలెనాడు ఇల్లంతా దీపాలు పెట్టేదానివి
గా దీపాలనడ్మ చందమామలా కన్పించేదానివి
అయ్య నీవు అమాసనాడు బుట్టి
మా బతుకుల్లో పున్నిమి నింపితివి
యేడాదికొక్కసారి నీ ముందు దీపం పెడతాం
దాంట్లో నిన్ను జూస్కుంట యజ్జేస్కుంటం
మా బతుకుల్ని చల్లంగ ఉంచమని
మా బుద్ధుల్ని చక్కంగ నడిపించమని తలుస్తాం
అవ్వా గిప్పుడు నువు లవు యాదికస్తున్నవే!
నీ పెల్లాం ముట్టించే దీపెంతకు మొక్కుతా!

-రాంబత్రి గంగాధర్

ఎనిమిదీ ముప్పయికి ట్రెయిన్ అని తెలిసినా, ఏడు గంటలకే స్టేషనుకు వెళ్ళాను. తీరా వెళ్ళాక తెలిసింది. ట్రెయిన్ రెండు గంటలు లేటని...

ఓ పెద్ద సూట్‌కేసూ, ఓ ఎయిర్ బ్యాగూ, కూలీని కేకేసి, అవి యిచ్చి, అంత పెద్ద అప్పర్ బ్రిడ్జి ఎక్కి ఆవలివైపు ప్లాట్‌ఫాం మీదకు చేరాను. అంతా రణగొణ ధ్వనిగా వుంది. బొకారో గాని, జనతా గానీ, ప్యాసింజరు గానీ ఏదీ రాలేదుట. అన్ని రైళ్ళ కోసం వచ్చిన ప్రయాణీకులు కాచుక్కూచోడంతో అంతా రణగొణ ధ్వనిగా వుంది - ఒక స్తంభం మొదటలో కట్టిన సిమెంటు చప్టా మీద ముడుచుకు కూచున్నాను. కూలీ

## చలికాలం

**చ**లికాలం - దాని కాకలి కాలం
చక్కటి ఆరుగాలం
మందులకు లొంగని ఈ మాయజాలం
మబ్బుల్లో దాగుంటూ తుమ్ములతో గర్జిస్తుంది!
ముక్కుపుటాల్నుండే వర్షిస్తుంది
ఇస్నోఫిలియాను పెంచి ఇరికిస్తుంది!
పిలవని చుట్టంలా వచ్చి పలకరిస్తుంది!
చిన్నా పెద్దా భేషజాలు లేకుండా
ఎగిసిపడుతుంది!
ఎగిరి వాలుతుంది!
ఎంతటివాడినైనా వాడిన పూవులా చేస్తుంది.
ముక్కుసూటిగా చెప్పాలంటే
పర్యావరణం దాని శత్రువు
పులుపూ-తీపులు దాని ఆస్తిపాస్తులు!
స్వరాన్ని మందగించి
అపస్వరాన్ని పలికిస్తుంది
నిద్రలో గుర్రుమంటూ
దాని ప్రతాపాన్ని చూపుతుంది
తేమ-దోమల్లో దాగిన
దాని చిరునామా!
పుప్పొడి-రుతు మార్పిడులు
దాని విజృంభణకు సంకేతాలు!
వివిధ వృత్తుల వారిని
పరిపరి విధాలుగా బాధిస్తుంది!
దుమ్ము దమ్మై మారుతుంది
మారుతంలో కనబడకుండా దాని పౌరుషం
చూపిస్తుంది!

-ఎస్. నాగేంద్రశర్మ

పక్కనే సామాన్లు పెట్టి వెళ్ళేడు.

దాదాపు యాభై, అరవై మంది దాకా ఓ తండా లాగా వచ్చి చేరారు. గోతాల్లో కట్టిన పాత్ర సామానూ, చిన్ని చిన్ని గోనె సంచుల్లో కొన్ని పాత గుడ్డలూ, చిన్న చిన్న చెక్క పెట్టెలూ, కొన్ని... చిన్న చిన్న రేకు పెట్టెలూ, అందులో ఏవో కొన్ని సామాన్లూ వగైరా...!

ముతక చీరలూ, అవి కట్టుకున్న పద్ధతీ, ఈ వైపు వాళ్ళలా అన్పించలేదు. ఉత్తరాది నుండి కేవలం వ్యవసాయపు పని పాటల కోసం వచ్చి, ఆ పనులు పూర్తి కాగానే కూలిడబ్బులు కూడబెట్టుకున్న ఉత్సాహాన్ని వెంటబెట్టుకుని, తిరిగి స్వస్థలానికి వెళ్ళిపోయే వాళ్ళలాగా అన్పించారు. ప్యాసింజరు రైలులో వెళ్ళాలేమో, అది బాగా పొద్దుపోయి గానీ రాదేమో, స్థిమితంగా పక్కలు పరుచుకుంటున్నారు.

ఉన్న ఒక్క దుప్పటీ ఒంటికి చుట్టబెట్టుకుని, ఎవరికి వాళ్ళు నేల మీద వాలిపోయి, తలల కిందకు వాళ్ళ వాళ్ళ పెట్టెలు జరుపుకుంటున్నారు. చిన్న బిడ్డల్ని గుండెల్లోకి పొదుపుకుంటున్నారు. ముసలీ ముతకా ఓ చోట చేరి, ఆడా మొగా కలిసి అడ్డపొగ పీలుస్తున్నారు. అలా నిప్పున్న వైపు నోట్లో పెట్టుకుని పీలుస్తున్న వారి వైపు నాలుక కాలదా అన్నట్టు ఆశ్చర్యంగా చూస్తున్నాను.

సన్న సన్నగా వున్న గాలి విసురు మరికాస్త హెచ్చయ్యింది. పమిట భుజాల చుట్టూ తిప్పి కప్పుకోవాలంటే ఏమిటోగా ఫీలయ్యే నేను కూడా పమిటను భుజాల చుట్టూ తిప్పి బిగించి పట్టుకున్నాను. చిరు చలి వణికిస్తున్నది.. ఒంటిని. పిల్లలు, శ్రీవారూ, రాజూ, బంధువులూ మెదుల్తున్నారు మదిలో.

సన్న తుప్పరగా మొదలైన జల్లు కాస్త విసురైంది... ఆడా మగా అంతా ప్లాట్‌ఫాం అంచులు వదిలి, మధ్యకి వచ్చారు. ఇంతలో జనతా వచ్చింది. పక్కనే వుండి, ఇంతదాకా కబుర్లు చెప్పిన తోటి ప్రయాణీకులు రైలెక్కేశారు. రైలు కదిలాక చూస్తే నేనూ మరో నలుగురు ప్రయాణీకులు, ఈ తండా ప్రజలు తప్ప మరెవ్వరూ కన్పించలేదు.

తీరిగ్గా పరిశీలిస్తూ కూచున్నాను. నడి వయసులో వున్న ఓ వ్యక్తి.. ప్రక్కన భార్య. ఐదారేళ్ళ కూతురు వున్నారు. వాళ్ళూ ఆ తండాలోనివాళ్ళే. భార్య బొద్దుగా గుమ్మటంలా వుంది. అతను సన్నగా పీలగా వున్నాడు. నేలమీద చతికిలబడి, ఒళ్ళో బిడ్డ నుంచుకొని, ఒదిగి కూచున్నదావిడ! చలికి ఒణుకుతూ, పమిటి భుజాల

చుట్టూ తిప్పుకుందామంటే, చాలీ చాలనట్టు వుంది. ఓ గోనె సంచీ తీసి, అక్కడక్కడా చిరుగులున్న ఓ దుప్పటీ తీసి, భార్యకు తలమీంచి భుజాల మీదుగా కప్పి, బిడ్డకూ కలిపి చుట్టి, నిలుచున్నాడు. దుప్పట్లో ఒదుగుతూ, భర్త వంక మురిపెంగా చూసిందావిడ.

సన్నగా, రివటలా వున్న ఆ మనిషి దేహం, ఆ చలికీ, గాలికీ వణకడం స్పష్టంగా తెలుస్తున్నది. నల్లగా, నీరుకావి పట్టిన పలుచని పంచె మోకాలి పైభాగం వరకే కప్పి వుంది. బాగా మాసి వున్న కట్ బనియన్, సన్నగా, బక్కగా వున్న శరీరాన్ని ప్రస్ఫుటం చేస్తూ, పలుచగా వున్న ఎర్ర రుమాలు, రూపాయి పావలాకు అమ్మే రుమాలు... చెవుల మీదుగా, తల చుట్టూ తిప్పుకొని వున్నాడు.

చూస్తూనే వున్నాడు. అలా చలికి వణుకుతూనే వున్నాడు. సన్న సన్న తుంపర గాలి విసురుకు వచ్చి పైబడుతుంటే తడుస్తూనే వున్నాడు. మధ్య మధ్య జారిపోతుందేమో దుప్పటీ అన్నట్టు భార్యకు దుప్పటి సవరిస్తూనే వున్నాడు. "ఓరి పిచ్చివెధవ! ఈ చలికీ గాలికీ చొక్కా కూడా లేకుండా కొంకర్లు తిరిగి చస్తావురా! దానికి రవికా, చీరా, పావడా వున్నాయి. ఆ దుప్పటిలాగి నీవు కప్పుకోరా! లేదా, అంత ప్రేమ యితే కొద్దిగానైనా సర్దుకోమని, ఆ దుప్పట్లో నీవూ దూరిపోరా!" అని ఎలుగెత్తి అరుద్దామన్నంత తపన కలిగింది.

నా ఘోష గొంతులో సుళ్ళు తిరుగుతుండగానే.. గంట కొట్టారు. వచ్చే వచ్చే ప్యాసింజరన్నారు. బిలబిల లాడుతూ అందరూ లేచారు. సామాన్లు సర్దుకున్నారు. దుప్పటి పదిలంగా చుట్టుకునే ఆవిడ లేచింది. చిన్నా చితకా సామాన్లున్న సంచీలు వణుకుతూనే సర్దుకు పట్టుకున్నాడతను. అంతా రైలెక్కారు. ఒక్క కూతలో రైలు కదిలింది. దాదాపుగా ప్లాట్‌ఫారం నిర్మానుష్య మైంది.

పదకొండు గంటల పైగా అయింది. నేను ఒక్క దాన్నే ఆడమనిషిని. దూరంగా నలుగురు మగాళ్ళు ప్లాట్‌ఫాం అంచుకు నిలబడి, రైలు వస్తుందా, రాదా అన్నట్టు ఎదురు తెన్నులు చూస్తున్నారు. ఎప్పటికి వచ్చేదీ చెప్పలేమన్నారు స్టేషన్ మాస్టరు. ఇంటికెళ్దామంటే చీకటి... తుపాను. బిక్కు బిక్కు మంటూ ప్లాట్‌ఫాం మీద గువ్వలా కూచుండి పోయాను.

భయంకరంగా వురిమిన ఉరుము. ఎక్కడో పిడుగు పడే వుంటుంది. గాలి హోరు భయంకరంగా వినిపిస్తు న్నది. ఉన్నట్టుండి కరెంటు పోయింది. ప్లాట్‌ఫాం అంచుల మీదున్న మనుష్యులు నాకు సమీపంగా వచ్చారు. వాళ్ళూ నాకు మల్లే హైదరాబాదు వెళ్ళడానికి బెర్తు రిజర్వు చేసుకున్న వాళ్ళని వాళ్ళ మాటల మధ్య తెలిసింది.

గాలి విసురుకు వాననీరు విశాలంగా వున్న ప్లాట్‌ఫాం అంచులు దాటుకుని, మధ్యగా కూచున్న నాపై పడుతున్నది. పలచగా వున్న వెంకటగిరి జరీ నూలు చీర, తడిసి ముందే చలికి వణుకుతున్న శరీరాన్ని మరికాస్త వణికిస్తున్నది. ఎప్పుడు ప్రయాణం చేసినా, లావాటి దుప్పటి, బాగా పెద్దదిగా అన్పించే టర్కీ టవలూ.. తెచ్చుకునేదాన్ని. ఈ రోజు ఎందుకులే అని నిర్లక్ష్యం చేసినందుకు నన్ను నేను తిట్టుకుంటున్నాను.

మరో ప్లాట్‌ఫాం పైనున్న స్టేషను మాస్టరు రూంలో నుండి వెలుగుతున్న ఎమర్జన్సీ లైటు తాలూకు వెలుగు మసక మసగ్గా ఆకారాల్ని మాత్రమే కనబరుస్తున్నది. కవళికలు కనుపించడంలేదు.

సూట్‌కేసు తీసిన చప్పుడుకు తిరిగి చూశాను. ఇందాక దూరంగా వున్న వ్యక్తి దగ్గరగా నిలబడి, కూర్చుందుకు ఉపయోగపడే బల్లపై సూట్‌కేసుంచి,

## సుస్వాగతం

మంచు ముత్యాలతో
వెచ్చని ఉషోదయాలతో
వజ్రకాంతుల చిరు చిగురులతో
పండుగల సందళ్లతో
రేగుపండ్లతో భోగి మంటలతో
భోగాలతో తీపి రాగాలతో
నూతన చైతన్యకర వత్సరాన్ని
ఉవ్విళ్లూరే ఊయలతో స్వాగతిద్దాం
ప్రతియేడు ప్రతినాడు
అన్ని రంగాలలో
అన్ని వర్గాలలో
అన్ని మనసులలో
మిగిలిపోయే
చేదు అనుభవాలు
పునరావృతం కాజాలని
వత్సరానికి
సుస్వాగతం పలుకుదాం!

-వై.కె. మూర్తి

మూత తెరిచి, అందులో నుండి బాగా పెద్దదిగా ఉన్న టర్కీ టవలు తీశాడు.

అటే చూస్తున్న నా ఒళ్ళో దాన్ని పడేస్తూ.. "కప్పు కోండి... బాగా ఒణికి పోతున్నారు" అన్నాడు. వద్దనా లన్పించలేదు. కృతజ్ఞతతో ఆర్ద్రమైంది మనసు. తల మీంచి తిప్పి, భుజాల చుట్టూ కప్పుకున్నాను. "మరి మీకో?" తలెత్తి చూస్తూ అడిగాను. "మాకు... పరవా లేదులెండి" సన్నగా నవ్వుతూ పలికేడు. మసక మసక వెలుతుర్లో తెల్లగా పలువరుస మెరిసింది.

ఉండీ, ఉండీ వర్షం కుంభవృష్టిగా మారింది. దానికితోడు గాలి హోరు. ఏమనుకున్నాడో! అంతెత్తు అప్పర్ బ్రిడ్జి మీదుగా, పరుగెత్తి పదిగజాల దూరానున్న స్టేషన్ మాస్టరు గదికి వెళ్ళాడు. కళ్ళు విప్పార్చుకు చీకట్లోకి చూశాను. మెరిసే మెరుపు వెలుగులో, గాలికి పడిపోబోతూ, బ్రిడ్జి కమ్ములు పట్టుకు, అతను పరుగు లాంటి నడకతో వెళ్ళడం కనిపిస్తున్నది.

వెళ్ళినవాడు వెళ్ళినట్టే తిరిగి వచ్చాడు. వేసుకున్న ప్యాంటు, షర్టు పూర్తిగా తడిసి, తల తడిసి, సన్నగా వణుకుతూ, "తల తుడుచుకోండి.." అంటూ టవలు విప్పి ఇవ్వబోతే "వద్దు.. వద్దు...!" అంటూ ఆదుర్దాగా వారిస్తూ, జేబులో నుండి కర్చీఫ్ తీసి, తల తుడుచు కున్నాడు.

"కాస్త వాన తగ్గనీయండి. స్టేషను మాస్టరు గారి నడిగాను. వెయిటింగ్ రూంలో స్టాఫ్ వున్నారట. వారి రూంలోనే ఓ వైపు కూర్చోమన్నారు" అన్నాడు. ఎందుకో తలమీంచి ఏదో భారం తీరిపోయినట్టనిపించింది. ఆడవాళ్ళు ఎన్ని రాజ్యాలేలినా, మగతోడు వుంటేగానీ, పరిపూర్ణత సిద్ధించదేమోనన్న ఆలోచన.

కొంచెం వానజోరు తగ్గినట్టనిపించింది. నా సూట్‌కేసు చేతిలోకి తీసుకుని, బ్యాగ్ అందుకోబోయాను. వారిస్తూ.. గబుక్కున బ్యాగ్ చేతిలోకి తీసుకున్నాడు. మరో చేత్తో అతని సూట్‌కేసు తీసుకొని, గబగబా బ్రిడ్జి ఎక్కి పరుగులు పెడుతున్నట్టు స్టేషను మాస్టరు రూంకు ఆనుకుని, రికార్డున్న రూం వుంది. అందులో.. కూచోమన్నారు. మనసులోనే ధన్యవాదాలర్పించాను.. ఆయనకి.

చీర బాగా తడిసి వుంది. మరో చీర మార్చుకునే ఓపికా, వీలూ లేదు. టవలు తీసి క్రింద పరుద్దామా, వద్దా అనుకునేంతలో, సూట్‌కేసు తెరిచి, ఓ దుప్పటి తీసి, క్రింద పరిచేడు. నాలుగు మూలలూ సవరించేడు. "ఏవండీ! మీరిక్కడ పడుకోండి" అంటూ సూట్‌కేసు తీసి, ఓ వైపు పెట్టాడు. చేతులెత్తి దండం పెట్టాల న్పించింది.

"మరి మీరో?" అందామనుకుని, నోరు తెరిచాను. ఓ పాత అట్ట పెట్టె వుంటే సాపుచేసి, ఓ పక్కగా పడ వేసి వున్నది.. దాన్ని మరోవైపుకు లాగి, దులిపి, పరుచు కున్నాడు. తలక్రిందుగా, ఓ చెయ్యి ముడుచుకుని పడు కున్నాడు.

వి.ఐ.పి. సూట్‌కేసూ, చేతినున్న ఖరీదైన వాచీ, రెండు వుంగరాలూ, గోల్డు ఫ్రేమున్న అద్దాలు, ఖరీదైన ప్యాంటు, స్లాకు. గొప్ప కుటుంబంలోని వ్యక్తిలా అనిపిస్తున్నాడు. 'పాపం, ఏం ఖర్మవచ్చింది? నా వల్ల?" అనుకుని, ముడుచుకు పడుకున్నాను. టవలు చుట్ట బెట్టుకునే..!

ప్రక్కనే నిర్విరామంగా ఫోన్లు మోగుతున్నాయి. ఎక్కడి రైళ్ళక్కడ ఆపేశారుట. గాలి హోరు తగ్గితే గానీ బయల్దేరవట. వర్షం జోరు తగ్గింది. తుఫాను పైకి వెళ్ళిపోయినట్టు వార్త. కర్ణాకర్ణిగా వినబడే వార్తలు వింటూ, కళ్ళు మూసుకున్నాను.

"ఏవండీ! తెల్లవారింది లేవండీ!" అంటున్నారెవరో. కళ్ళు విప్పి చూశాను. పక్కనే అతను. బాగా వెలు గొచ్చింది. ఈ స్టేషనులో ఆపివేసిన గంగా కావేరి జనం, స్టేషనంతా బిలబిలలాడుతున్నారు. లేచి దుప్పటీ, టవలు మడతబెట్టాను. వెయిటింగ్ రూం ఖాళీ అయిం దట. గబగబా సామాన్లన్నీ అందులోకి చేరవేశాడుట. 'ఇంటికి వెళ్దామా' అనుకుంటే, 'ఇదుగో వచ్చె వచ్చె! అదుగో వచ్చె వచ్చె రైల'ంటున్నారు. తీరా వెళ్తే, రైలు వచ్చి వెళ్ళిపోతే, రిజర్వేషన్ పోతే పోయింది... అక్కడ నాకోసం... వంద మైళ్ళ దూరాన్నుండి వచ్చి, నాంపల్లి స్టేషనులో ఎదురు తెన్నులు చూస్తున్న నా నేస్తం గుర్తొచ్చి చలించిపోయాను.

వెయిటింగ్ రూంలో ముహం కడుక్కునీ, తల దువ్వకునీ తయారయ్యాను. పక్కనే వున్న హోటల్లో టిఫిన్ తెస్తానంటే వద్దన్నాను. ఎందుకో అతనిచేత ఇంక సేవలు చేయించుకోవడం బాగనిపించలేదు. పైగా అతని డబ్బు ఖర్చు పెట్టించాలన్పించలేదు. ఇచ్చినా తీసుకోడన్పించింది.

తీరిగ్గా కూచుని కబుర్లు పెట్టుకున్నాము. రాత్రి వున్న ప్రయాణీకులు రిజర్వేషను కాన్సిల్ చేయించుకు వెళ్ళిపోయారేమో! కొత్తవాళ్ళెవరెవరో వచ్చి కూర్చుంటు న్నారు. అన్నీ గమనిస్తూనే ఏదో మాట్లాడుతున్నాను.

మా వూరికి దగ్గర్లోనే వున్న రుద్రకోటట. కంట్రాక్టు

పనిమీద హైదరాబాదు వెళ్తున్నట్టు... వెలుగులో బాగా చూశాను. సూది ముక్కు.. లైట్లలా వెలుగుతున్న చిన్ని చిన్ని కళ్ళు. బిగించినట్టున్న ఎర్రని పెదిమలు. బాగా కురచగా కత్తిరించిన నొక్కు నొక్కుల జుట్టు. ఎత్తుగా, బలంగా వున్న విగ్రహం. మంచితనం, సౌకుమార్యం.. మూర్తీభవించిన ఆకృతి. చేతులు ఎర్రగా, చిదిమితే రక్తం చిందేంత ఎర్రగా, కలువ మొగ్గల్ని గుర్తుకుతెస్తూ... నవ్వుతూ, నెమ్మదిగా మాట్లాడే మాటల్లో చదువు నేర్పిన సంస్కారం...

పదయింది... పన్నెండయింది. అదుగో, ఇదుగో... అన్న రైలు అడ్రసు లేదు. ఒకలాంటి విసుగ్గా, బడలికగా.. కడుపులో ఏమీ లేక ఆకలిగా వుంది. కానీ ఏం చెయ్యను? ఇంక ఎటూ మైలు పైగా దూరమున్న ఇంటికి వెళ్ళే పరిస్థితి కాదు.. వెళ్ళినా వంట చేసే టైమూ లేదు.

పావుతక్కువగా రెండయింది. గంట కొట్టేరు.. ఏనుగు నెక్కినంత సంబర పడ్డాను. షరా మామూలే! సూట్కేసులు రెండూ తను తీస్కుని బ్రిడ్జి ఎక్కేడు. బ్యాగ్ తీసుకు తన వెంట నేనూ నడిచాను. ఎదురు చూసిన రైలు ఎట్టకేలకు వచ్చింది. రిజర్వేషన్ నెంబర్ సరి చూసుకుని, సామాను సర్దుకుని స్థిమితపడ్డాను. క్రింది బెర్తు నాది, పైబెర్తు వారిది.

నెమ్మదిగా కదిలింది రైలు. కిటికీ పక్కగా కూచున్నాను. నా బెర్తు మీదే మరోవైపు తను కూచున్నాడు. దాదాపు చాలావరకూ ఖాళీగానే వుంది బోగీ! కడుపులో ఆకలి కరకరమంటున్నది. కానీ, ఏం చెయ్యను? అన్నం దొరికే సమయమూ కాదు. వీలూ లేదు. ఒంగోలు స్టేషనులో దిగి బిస్కెట్ ప్యాకెట్స్ తెచ్చేడు. తను డబ్బులివ్వబోతే తీసుకోలేదు. ఒకలాగా చిన్నబోయినట్టయింది మొహం. "పరవాలేదండీ! ఎపుడైనా మీ ఇంటికొస్తే, కాఫీ ఇచ్చి బాకీ తీర్చుకుందురు గాని. తినండి...!" అన్నాడు. నెమ్మదిగా ప్యాకెట్ విప్పి నేనో నాలుగు తీసుకుని, తనకో నాలుగిచ్చేను. వాష్ బేసిన్ దగ్గర, నీళ్ళు తాగుదామని చూస్తే చుక్క రాలేదు. నిట్టూర్చి వచ్చి కూచున్నాను.

"పడుకోండి...!" అన్నాడు. సమాధానంగా చేతి నిండుగా వున్న గాజుల్ని, మెడలో నగల్ని చూసేను. నవ్వి "పరవాలేదు. నేను కాపలా! పడుకోండి!" అని దుప్పటి దిండులాగా మడిచి, ఓవైపు పెట్టి తను ఎదురు బెర్తు మీద కూచున్నాడు. పడుకున్నాను. రాత్రి పడ్డ శ్రమకు, విసిగిన శరీరం.. రైలు పాడే జోలపాటకు, ఊపే ఉయ్యాలకు సన్నగా నిద్రపట్టింది.

సన్నగా కుదిపినట్టయి, కళ్ళు తెరిచాను. ఎదురుగా, ఓ పొట్లం చేతబుచ్చుకుని, "చీరాలలో ఎవరో దాతలు విసిరారండి. తుఫాను తాకిడికి రైలులో జనం ఇలా ఇబ్బంది పడతుంటారని, అన్నం పేకెట్లు విసుర్తుంటే నేనూ ఒకటి దొరకబుచ్చుకున్నాను. తినండి" అంటూ ప్యాకెట్ విప్పి, నా బెర్త్‌పై పెట్టాడు. ఎలా కృతజ్ఞత తెలపాలో, ఏం చెయ్యాలో అర్థం కాలేదు.

"మరి మీకో?!" అన్నాను. "మీరు తినండి.. నాకేం పరవాలేదు" అన్నాడు. వంచుకున్న కళ్ళల్లోంచి, సన్నగా రెండు కన్నీటి బొట్లు జారిపడ్డాయి. ఆ విస్తట్లోనే ఆ అన్నం చెరోవైపుకు రెండు భాగాలుగా సర్దేను. "రండి! మీరూ తినండి" అంటే తటపటాయించాడు. "పరవా

## ప్రతి మనిషీ ఒక ప్రపంచం

ఒక్కొక్కరిది ఒక్కో లోకం
ఎవరి ప్రపంచం వారిదే
ఫోర్జరీ చెయ్యలేని వేలిముద్రలా
ఎవరూ మరొకరిలా వుండరు.
వజ్రం కూడా
బొగ్గే అంటే ఎలా?
సాధనను బట్టే
సాఫల్యం.
ఆ గడ్డిపువ్వు
పారిజాతం కానందుకు
దిగులు పడుతుందా!
అది పిల్లవాగే
చెలియలికట్ట దాటలేని
సముద్రాన్ని చూసి జాలిపడుతుంది.
ఇసుకను
ఎంత పిసికినా ముద్దకానట్టు
చిక్కువుండలో దారం దొరకనట్టు
ఆలోచనలు.
మనకు తెలిసిన వేదాంతం
ఇతరులకు చెప్పటానికే
వ్యాఖ్యానాలూ
మనకోసమే.
పోలికల్లో
సత్యాలు ప్రవహిస్తాయా?
బాహ్య దృశ్యాలకు వేర్లు
లోపలి లోతుల్లోనే వుంటాయి.

-ఎన్. అరుణ

లేదు! తీసుకోండి!" అని కాస్త ముందుకు జరిపాను. వచ్చి కూచున్నాడు. నెమ్మదిగా తినసాగేడు. రుచిలో అమృతంలా అనిపించడమే గాదు.. ముద్ద ముద్దా అతని మంచితనంలో ముంచుకు తిన్నట్టనిపించింది.

రాత్రి అయినా, ఎక్కడా భోజనానికి ఆపనూలేదు. రైల్వే క్యాంటీను వాళ్ళు భోజనాలు తెచ్చి పెట్టనూ లేదు. మధ్య మధ్య స్టేషన్లలో వడలూ, బిస్కెట్లూ తెచ్చి ఇచ్చేవాడు. సికింద్రాబాదు స్టేషన్ చేరేసరికి వేకువ ఝాము మూడయింది.

"ఏవండీ! నేను ఇక్కడ దిగిపోవాలి. పోనీ, మీరూ రండి, మావాళ్ళ ఇంట్లో వుండి, తెల్లారి మీవాళ్ళ ఇంట్లో వదుల్తాను. మీ కోసం వాళ్ళు వస్తారో రారో?" అన్నాడు. "లేదండీ, ఇంత తుపానులో, నన్ను బయల్దేర దీసిన ఈ స్నేహమే ఇంకిన్ని తుపానులొచ్చినా, రాజును స్టేషను లోనే ఎదురు చూసేలా చేస్తుంది" అన్నాను దృఢస్వరంతో.

రెండు చేతులూ జోడించి నమస్కరించి సెలవు తీసుకున్నాడు. నిర్మానుష్యంగా వున్న అడవిలో ఒంటరిగా నిలిచిపోయిన అనుభూతి. సన్నగా వస్తున్న రైలు శబ్దం తప్ప మరేం లేదు. సికింద్రాబాదు స్టేషనులో చాలా వరకూ అందరూ దిగిపోయినట్టుంది.

దూరంగా పరుగులాంటి నడకతో వస్తున్నాడతను. ఎందుకా? అని చూశాను. వస్తూనే, ఏవండీ, నా కోసం కారు వచ్చింది. మీరు వస్తే దింపుతాను అన్నాడు. "లేదండీ! రైలు కోసం ఎదురు చూస్తుంటాడు రాజు" అన్నాను. కాస్సేపు ఆలోచిస్తూ నిలబడ్డాడు. పెన్ తీసి, సిగరెట్ ప్యాకెట్ మీద ఏదో వ్రాసి, "ఒకవేళ మీ వాళ్ళెవరూ రాకపోతే, ఈ నెంబరుకు ఫోన్ చెయ్యండి. నేను వచ్చి రిసీవ్ చేసుకుంటాను. తర్వాత మీ వాళ్ళింట్లో వదులుతాను. ఏం భయంలేదుగాండీ!" అంటూనే దిగి పోయాడు. వడివడిగా వెళ్తున్న అతని వేపు నిర్నిమేషంగా చూస్తుండిపోయాను. కళ్ళు మసకలుబారాయి కన్నీళ్ళతో.

నెమ్మదిగా నాంపల్లి స్టేషనులో ప్రవేశించింది రైలు. వర్షం ఆగినా, పైనుండి చుక్కచుక్కలుగా రాల్తున్నాయి నీళ్ళు. జనం రద్దీ... కూలీల గొడవ.. ఆ నిశ్శబ్దపు వేకువన సన్న సన్నగా.. గోల గోలగా..!

సామాను దింపుకుని నిలబడ్డాను. ఏడీ రాజు?! ఓవైపు చూస్తున్నాను. మరోవైపు నుండి పరిగెత్తుకు వచ్చా డు. తడిసి అంచులు మాసిన, బురద కొట్టుకుంటు న్నట్టున్న ప్యాంటూ, బాగా రేగిపోయిన రింగుల తలా, పిచ్చివాలకం...

రెండు చేతులూ పుచ్చుకు ఊపివేశాడు. కళ్ళనిండా నీళ్ళు. చేతులు రెండూ పట్టుకు నుదురుకు ఆనించు కున్నాడు. కలవరింతగా... "ప్రియా! ప్రియా...! ఏమై పోయావో, ఎలా బయల్దేరావో తుపానులోనని వణికి పోయాను తెలుసా! ఉదయం నుండి వెళ్ళబుద్ధిగాక, స్టేషన్‌లో పిచ్చిపట్టినట్టు ఎదురు చూస్తున్నాను తెలుసా?" ఉద్వేగంగా, ఓవైపు వణికే గొంతుకతో, ఆతృతగా, ఆర్ద్రతగా, ఆవేదనగా చెబుతున్నాడు రాజు.

అప్పటిదాకా బిగబట్టిన బాధ ఒక్కసారి పెల్లుబి కింది. కష్టాల కడలి దాటి తీరం చేరిన సంతోషంతో కలిగిన బాధ కరిగి నీరయ్యింది. "రావేమో! అనుకు న్నాను రాజూ. గుండె గొంతుకలో కొట్టుకలాడింది. తన చేతిలోని నా చేతిని గట్టిగా ఒత్తి భయంగా, "అమ్మో! రాకపోవడమే! నిన్ను ఒంటరిగా వదిలి..." అంటూనే ఒక చేత్తో సూట్‌కేసు అందుకుని, మరోచేయి, నా భుజాల చుట్టూ చుట్టి 'నేనున్నాను నీకు రక్షణ' అన్నట్టుగా వేశాడు. బ్యాగ్ చేతిలోకి తీసుకుని కదిలాను. ఎందుకో... రాజ్యాలు గెలిచిన ధీమా. పడిన కష్టమంతా చేత్తో తీసేసిన భావన.. మనసు పొరల్లో ఆర్ద్రంగా తొంగి చూస్తూ అతనూ, రాజూ... లోకమంతా నిండిపోయిన మగవాళ్ళు... మగజాతి...

పేపర్లలో వచ్చే వార్తలూ, అప్పుడప్పుడూ వినబడే కబుర్లూ మగాడినో కసాయివాడుగా చిత్రిస్తాయే గానీ, మగవాడో మైనపు ముద్ద అనీ, ఏ మాత్రపు వేడికైనా కరిగి నీరైపోతాడనీ, ఏ తీరున కావలిస్తే ఆ తీరున మలుచుకొంటే మలుగుతాడనీ, ఈ ఆడజనం ఎన్నటికి తెలుసుకొంటుందో?

ఏ జాతిలోనైనా, ఏ కాలంలోనైనా, మగవాడు, ఆడదానికి అండగా, తోడు నీడగా నిలుస్తూనే వున్నాడు. తన రెండు చేతులూ చాచి ఆదుకుంటూనే వున్నాడు. చిన్నతనంలో తండ్రిగా, బాల్యంలో సోదరునిగా, యుక్త వయస్సులో ప్రియునిగా, వివాహానంతరం భర్తగా, మాతృత్వంలో బిడ్డగా, వృద్ధాప్యంలో మనుమనిగా.. సకల కాలాల్లో స్నేహితునిగా... తన ప్రేమానురాగాలు పంచిపెడుతూనే వున్నాడు. కానీ ఎందుకు అర్థం చేసుకోదు మగవాడ్ని ఆడది?

"ఆడవాళ్ళూ తెలుసుకోండి! మగవాళ్ళు కసాయి వాళ్ళు కాదండీ! ఒట్టి మైనపు ముద్దలండీ! అదేమంటె పురాణ పురుషుల్ని ఉదాహరణ తేకండి! వాళ్ళ పరిస్థి తుల వెనక యధార్థ గాథలేమిటో తెలుసుకోండి. మగ వాణ్ని అర్థం చేసుకుందుకు ప్రయత్నించండి!" అని ఎలుగెత్తి చాటాలన్నంత ఆక్రోశం కలిగింది. ■